క్లుప్తంగా

ఎండతీవ్రతకు గురికావద్దు



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ

సోమశిల: రానున్న రోజుల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకోవాలని అడిషనల్ డీఎంహెచ్ఓ, జిల్లా టీబీ అధికారి ఖాదర్‌వలి చెప్పారు. అనంతసాగరం ప్రాథమిక వైద్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు ప్రతి గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని సూచించారు. శరీరంలో నీటి నిల్వలు పడిపోకుండా తరచూ నీటిని తాగాలని సూచించారు ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పీ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ యు శ్రావణి, సీహెచ్ఓ, పీహెచ్ఎన్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఏఓ మృతి



ఎన్ బ్రహ్మచారి (ఫైల్)

కలిగిరి: ఎంపీడీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎన్.బ్రహ్మచారి మంగళవారం మృతి చెందాడు. ఆయన కొంత కాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. అందరితో కలివిడిగా ఉంటూ బాధ్యతగా విధులు నిర్వర్తిస్తే బ్రహ్మచారి మృతిపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యార్థుల్ని పరీక్షలకు సన్నద్ధం చేయండి

ఉదయగిరి: ఈ నెల 6వ తేదీ నుంచి జరగనున్న సమ్మేటివ్–2 పరీక్షలకు విద్యార్థులను ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాలని ఎంఈఓ తోట శ్రీనివాసులు సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని శకునాలపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల పఠన, అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం వెంకటరత్నం, ఉపాధ్యాయులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పనిదినాల మార్పు

ఉదయగిరి: ఉదయగిరి, వింజమూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల పనిదినాల్లో మార్పులు చేసినట్లు ఉదయగిరి సీడీపీఓ పచ్చవ లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 4 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచి ఉంటాయన్నారు. మే 1 నుంచి 15వ తేదీ వరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు, మే 16 నుంచి 31వ తేదీ వరకు అంగన్‌వాడీ హెల్పర్లకు సెలవులు ఉంటాయని చెప్పారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులు గమనించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

సోమశిల: అనంతసాగరం, మర్రిపాడు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల సమయాల్లో మార్పులు చేసినట్లు సీడీపీఓ పద్మావతి మంగళవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక్క పూట మాత్రమే మే 31 వరకు నిర్వహిస్తారని తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి యథావిధిగా అంగన్‌వాడీ కేంద్రాలు రెండు పూట్ల ఉంటాయన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

సోమశిల: సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అనంతసాగరం మండలంలోని సోమశిల చెక్‌పోస్టు, ఉప్పలపాడు హైవేలో మంగళవారం ఏఈ వివేక్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన వెంట కానిస్టేబుల్ వంశీ, వెంకట్రావు, నాగరాజు తదితరలు ఉన్నారు.

సర్వదేవతా హోమాలు



కలశ పూజలు చేస్తున్న అర్చకులు

ఆత్మకూరు: పట్టణంలో కొలువైన పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేక మహోత్సవాల్లో రెండో రోజు మంగళవారం యాగశాలలో వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీ మాజీ చైర్మన్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. టీటీడీ వేద పాఠశాల అర్చకులతో తొలుత పుణ్యాహవచనం, కలశ స్థాపన, విశ్వక్సేన పూజ, మేదినిపూజ, సర్వదేవతా హోమాలు నిర్వహించారు.

పంటకు జలయజ్ఞం

సాగు మధ్యలో చెరువు నీరు అడుగంటింది. చేతికందే పంట ఎండిపోతుందని కుమిలిపోతున్న రైతులకు ఆ సోదరులు అండగా నిలిచారు. స్థానిక రైతులు, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి భగీరథ యజ్ఞం చేసి సుమారు ఐదొందల ఎకరాల్లో పంట పండించారు. ఒక్కొక్క రైతు రూ.వేల పెట్టుబడి పెట్టిన రైతులు చిరకు సాగునీరందక ఆశలు వదులుకున్నారు. మోటార్లు, పైపులు వేసి నీటి తరలించి పంట పండించి తడారిన అన్నదాతల కళ్లల్లో ఆనంద భాష్పాలు చూసి సంతోషించారు.

వైఎస్సార్‌సీపీ నేతల కృషితో వరి పండింది

- చెరువులో అడుగంటిన జలాలు
- మోటార్లు అమర్చి పంట పొలాలకు తరలింపు



గండ్లవేడు చెరువులో జలాలను మోటార్ల ద్వారా పైపులైన్లతో పంట కాలువలకు తరలిస్తున్న రైతులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండంలోని గండ్లవేడు చెరువు కింద సుమారు 1105 ఎకరా సాగవుతోంది. వర్షాధారంగానే ఈ చెరువు కింద పంట పండేది. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే వర్షాలు విస్తారంగా కురిసి పంటలు సుభిక్షంగా పండాయి. ఉమ్మడి రాష్ట్రంలో 9 ఏళ్లు, విభజన రాష్ట్రంలో 5 ఏళ్లు చంద్రబాబు పాలనలో కరువు విలయతాండవం చేసి గింజకూడా పండించుకోలేదని దుస్థితి. ఆ గ్రామ చెరువు కింద పంటలు సాగు చేస్తున్న రైతులు చుక్క నీరు లేక తీవ్ర కరువు కాటకాలతో తల్లడిల్లారు. కనీసం తమ పాడి పశువులకు మేత కూడా లేకపోవడంతో వారి జీవనాధారంగా ఉన్న పాలిచ్చే గేదెలు, ఆవులు సైతం కసాయి సంతలకు తెగనమ్ముకున్నారు. బతుకుదెరువు కోసం స్థానిక రైతులు చీరాల, చిలకలూరిపేట, తదితర ప్రాంతాలకు వలస వెళ్లి చిరు వ్యాపారాలు చేస్తూ జీవితాలు కొనసాగిస్తున్నారు.

చివరి తడికి.. కన్నీటి తడి..

సుమారు 500 ఎకరాల్లో పంటకు చివరి తడికి సాగునీరు అవసరమైంది. అప్పటికే చెరువులో నీరు అడుగంటింది. తూముల ద్వారా నీరు కాలువలకు పారే అవకాశం లేకపోవడంతో రైతులు తల్లడిల్లిపోయారు. రూ.వేల పెట్టుబడి పెట్టి చివరి దశలో పంట కళ్ల ముందు ఎండిపోతుందని కంటతడి పెట్టుకున్నారు. రైతుల పరిస్థితిని చూసిన గండ్లవేడుకు చెందిన కొల్లి సోదరులు అఖిల్‌నాయుడు, దొరస్వామినాయుడు గ్రామానికి చెందిన దుర్గంపాటి శేషయ్య, దాడి శ్రీనివాసులు నాయుడు, ఏలూరు శ్రీహరి నాయుడు, మద్దినేని అప్పన్న, గున్నపనేని బయ్యన్న, తదితర రైతు నాయకులను సమన్వయం చేసుకుంటూ ఆయిల్ ఇంజిన్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసి పైపుల ద్వారా చెరువులో ఉన్న సాగునీటిని పంట కాలువలకు మళ్లించారు. వారి కృషి ఫలితంగా ప్రస్తుతం 500 ఎకరాలు పంట పండింది. గండ్లవేడు చెరువు కింద వరి పంటకు సాగునీరు ఏర్పాటు చేసేందుకు దొరస్వామి నాయుడుతో రైతులతో కలిసి చేసిన కృషిని ఆయకట్టు గ్రామాల రైతులు అభినందిస్తున్నారు.

నాలుగేళ్లు సుభిక్షం..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఐదేళ్లలో నాలుగేళ్లు సకాలంలో వర్షాలు విస్తారంగా కురిశాయి. గండ్లవేడు చెరువు కింద కూడా పంటలు బాగా పండాయి. అయితే ఈ దఫా వర్షాభావం నేపథ్యంలో గతేడాది అక్టోబరు, నవంబరు నెలల్లో కురిసిన వర్షాలకు అరకొరగా నీరు చేరడంతో స్థానిక రైతులకు తీవ్ర నిరాశ కలిగించింది. అయితే అప్పట్లో వచ్చిన తుఫాన్ కారణంగా వారం వ్యవధిలోనే వర్షపు నీటితో చెరువు నిండింది. చెరువు ఆయకట్టు కింద పడకండ్ల, గండ్లవేడు, వెన్నవాడ, బొటికర్లపాడు గ్రామాల్లో కొందరు రైతులు ముందుగా నార్లు పోసి వరినాట్లు వేసుకున్నారు. సుమారు 600 ఎకరాల్లో పంట చేతికి రాగా, ఇటీవల వరి కోతలు పూర్తి చేసుకున్నారు. మంచి గిట్టుబాటు ధరలకు తమ ధాన్యాన్ని కల్లాల్లోనే అమ్ముకున్నారు.

చంద్రబాబు పాలన దుర్భిక్షం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పరిపాలన, ఆయన తండ్రి దివంగత ముఖ్యమంత్రి ఆరేళ్ల పరిపాలనలో గండ్లవేడు చెరువు ఆయకట్టు కింద సమృద్ధిగా వర్షాలు కురవడం ద్వారా రైతులు, రైతు కుటుంబాలు పాడి పంటలతో సుభిక్షంగా ఉన్నారు. చంద్రబాబు నాయుడు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న ప్రతిసారి వానలులేక కరువుకాటకాలతో తల్లడిల్లిపోయాం. ఈ ఏడాది చివరి దశలో 500 ఎకరాల పంట వరి పంట పండేందుకు యింబవళ్లు రైతులతో కలిసి పని చేసిన దొరస్వామినాయుడు కృషిని మరువలేము.

– దాడి శ్రీనివాసులునాయుడు, రైతు, గండ్లవేడు, ఆత్మకూరు మండలం

మా ఊరి అభివృద్ధి ప్రదాతలు వైఎస్ జగన్, మేకపాటి



ఐదు దశాబ్దాలుగా గండ్లవేడు అన్ని విధాలా వెనుకబడితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ప్రభుత్వాలకు భిన్నంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి, ఆయన సోదరుడు, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యంతో మా ఊరు బహుముఖంగా అభివృద్ధి జరిగింది. వారిని ఆదర్శంగా తీసుకొని మా గ్రామం అభివృద్ధి కోసం సొంత నిధులు ఖర్చు పెట్టి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం.

– కొల్లి దొరస్వామినాయుడు, వైఎస్సార్‌సీపీ నేత, గండ్లవేడు, ఆత్మకూరు

దొరస్వామినాయుడు చేదోడుగా నిలిచారు



ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాలతో కొల్లి దొరస్వామినాయుడు కుటుంబీకులు మా గ్రామం కోసం తమ సొంత నిధులు ఖర్చు పెట్టుకొని ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. 500 ఎకరాల వరి పంట పండడం కోసం వారి సొంత నిధులతో ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసి వరి పంట రైతులకు అందేలా విశేష కృషి చేశారు. రైతులకు చేదోడుగా నిలిచి పంట పొలాలకు నా వంతుగా సాగునీటి సరఫరాకు సేవ చేయడం ఆనందంగా ఉంది.

– దుర్గంపాటి శేషయ్య, రైతు, గండ్లవేడు, ఆత్మకూరు మండలం

అడుగడుగునా ఉప్పొంగిన ఉత్సాహం



ఆత్మకూరు: బైక్ ర్యాలీలో విజయసాయిరెడ్డి, విక్రమ్‌రెడ్డి



సంగం: గజమాలతో విజయసాయిరెడ్డి, విక్రమ్‌రెడ్డిలను సత్కరిస్తున్న అభిమానులు

- సంగం నుంచి ఆత్మకూరు వరకు బైక్‌లతో భారీ ర్యాలీ
- గజమాలతో సత్కారం
- విజయసాయిరెడ్డికి వైఎస్సార్‌సీపీ నేతల అపూర్వ స్వాగతం

ఆత్మకూరు: రాజ్యసభ సభ్యుడు, నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి తొలిసారిగా మంగళవారం ఆత్మకూరు నియోజకవర్గానికి రావడంతో ఆయనకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. తొలుత సంగం నుంచి ప్రారంభమైన భారీ బైక్ ర్యాలీ బైపాస్ రోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్దకు చేరుకుంది. ఆయనకు భారీ గజమాలతో, బొకేలతో స్వాగతం పలికి శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 75 అడుగుల వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అక్కడి నుంచి శ్రీధర్ గార్డెన్స్ వరకు ప్రత్యేక వాహనంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డితో కలిసి సాగారు. దారి పొడవునా కార్యకర్తలు పూలు చల్లుతూ జైజగన్ నినాదాలు చేస్తూ యువత ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ మంగళవాయిద్యాలతో స్థానిక నాయకులు స్వాగతం పలికారు.

భారీగా పార్టీలో చేరికలు

ఈ సందర్భంగా చేజర్ల మండలానికి చెందిన తూర్పుకంభంపాడు వలంటీరు కృష్ణవేణి తన ఉద్యోగానికి రాజీనామా చేసి 75 కుటుంబాలతో కలిసి పార్టీలో చేరారు. ఇదే క్రమంలో యనమదల సర్పంచ్ సుందరరామిరెడ్డి ఆధ్వర్యంలో 70 కుటుంబీకులను వైఎస్సార్‌సీపీలో చేర్చడంతో మొత్తం సుమారు 150 కుటుంబాలకు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆత్మకూరు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని, సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకొనేందుకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేందుకు సమష్టి కృషి చేద్దామని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గానికి ప్రత్యేకంగా రూపొందించిన మేనిఫెస్టోను విజయసాయిరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ శ్రావణ్‌కుమార్, సర్దార్, జెడ్పీటీసీలు ప్రసన్నలక్ష్మీ, పీర్ల పార్థసారథి పి రాజేశ్వరమ్మ, ఎంపీపీలు కేతా వేణుగోపాల్ రెడ్డి, తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, బోయిళ్ల పద్మజారెడ్డి, పెయ్యల సంపూర్ణమ్మ, జేసీఎస్ కన్వీనర్లు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, జితేంద్రనాగ్ రెడ్డి, బాలిరెడ్డి సుధాకర్ రెడ్డి, పూనూరు రామమనోహర్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పట్టణ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన బైక్ ర్యాలీ

సంగం: నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిలకు సంగం మండల ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం ఘన స్వాగతం పలికారు. సంగం బస్టాండ్ కూడలి వద్దకు చేరుకోగానే వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పులగం శంకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ రఘునాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ గజమాలతో సత్కరించి, స్వాగతం పలికారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, విజయసాయిరెడ్డి అశేష జనవాహిని నడుమ యువత, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సంగం బస్టాండ్ సెంటర్ నుంచి బైక్ ర్యాలీ కొండ మలుపు మీదుగా హైవేపై సాగి ఆత్మకూరుకు చేరుకుంది. యువత వైఎస్సార్‌సీపీ జయహో అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు పందిళ్లపల్లి శివకుమార్ రెడ్డి, సూరి మదన్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ముడి మల్లికార్జునరెడ్డి, కరిముల్లా, గుండాల బాలచంద్రారెడి, మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఫణికుమార్‌రెడ్డి, శంకరయ్య, సర్పంచ్ చందన్‌కుమార్, వెంకయ్య నాయుడు, రాము తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బీసీ, ఎస్సీ, మైనార్టీలు

చేజర్ల: మండలంలోని తూర్పుకంభంపాడు (టీకేపాడు)లో సుమారు 100 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ గ్రామంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీలు ఆత్మకూరులో జరిగిన ఓ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గడిచిన ఐదేళ్లుగా తమ అభివృద్ధికి కృషి చేశారని, ఇప్పుడు ఆయన మరోసారి సీఎం కావడానికి తామంతా కలిసి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పంచేటి కృష్ణవేణి ఉడతా కిషోర్, మనుబోటి శ్రీకాంత్, హెచ్ శివ పాల్గొన్నారు.

టీడీపీ ప్రచార సభ తుస్

- వేమిరెడ్డి సభ అట్టర్‌ఫ్లాప్
- డబ్బు, మద్యం ఇచ్చినా రాని జనాలు
- బొల్లినేని రామారావు సమావేశానికి డుమ్మా



బీకే అగ్రహారం వద్ద వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆహ్వానించడానికి వచ్చిన అరకొర జనం

జలదంకి: మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని తన సొంతూరులో టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌తో కలిసి నిర్వహించిన రోడ్‌షో, ప్రచార సభ అట్టర్ ఫ్లాప్ అయింది. మండలంలోని వంటేరు స్వగ్రామం బీకే అగ్రహారంలో ప్రచారం సభకు సమీప గ్రామాలు, మండలాల నుంచి జనాన్ని డబ్బు, మద్యం ఇచ్చి తరలించినా.. తుస్‌మంది. ప్రతి గ్రామంలో కూలీలను తీసుకెళ్లే మహిళా మేస్త్రీలకు డబ్బులిచ్చి సమావేశానికి తరలించే ప్రయత్నాలు చేశారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు డుమ్మా కొట్టారు. ఆయన వర్గీయులను సైతం సభా వేదిక పైకి ఆహ్వానించకపోవడంతో సభ నుంచి వెళ్లిపోవడం కనిపించింది. మండలంలో ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌కు మొట్టమొదటి నుంచి అనుచరులుగా ఉన్న వారిని సైతం పక్కన పెట్టడంతో కాకర్ల వర్గీయులు సైతం అసహనం వ్యక్తం చేశారు. తన స్వగ్రామం బ్రాహ్మణక్రాకలో బహిరంగ సభను విజయవంతం చేద్దామని ప్రయత్నించిన వంటేరుకు తీవ్ర అవమానం మిగిలింది. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని విమర్శించడంపై స్థానికులు పెదవి విరిచారు. సభ ఆశించిన విధంగా సక్సెస్ కాకపోవడంతో టీడీపీ నేతలతో పాటు పార్టీ శ్రేణులు నిరుత్సాహానికి గురయ్యారు.

జగనన్న ప్రభుత్వంలోనే మైనార్టీల అభ్యున్నతి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే



దువాలో పాల్గొన్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి

సంగం: రాష్ట్రంలో గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల అభ్యున్నతిని కాంక్షించి వారి కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టి అభివృద్ధిలోకి తీసుకొచ్చారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం సంగంలో ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో సంగం ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే మేకపాటి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మైనార్టీలంతా జగనన్న వెంట నడిచి ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నేతలు రియాజ్, ఖాదర్‌బాషా, ఖాజాపీర్, షరీఫ్, నదియానా, కరిముల్లా, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పులగం శంకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, సూరిమదన్‌మోహన్‌రెడ్డి, నేతలు గుండాల బాలచంద్రారెడ్డి, ఫణికుమార్‌రెడ్డి, కమతం కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు దేవసహాయం, సర్పంచ్ మానికల చందు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ నేతకు అపూర్వ స్వాగతం



నాగులవరం నుంచి సుందరగిరివారి కండ్రిగ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అభిమానులు, కార్యకర్తలు

- హారతులిచ్చి, దిష్టి తీసి స్వాగతించిన పల్లెజనం
- జైజగన్ నినాదాలతో హోరెత్తిన గ్రామాలు

బిట్రగుంట: కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బోగోలు మండలంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ఘన స్వాగతం లభించింది. మండలంలోని సుందరగిరివారి కండ్రిగ, సోమేశ్వరపురం, జక్కేపల్లిగూడూరు, ఏబీ కండ్రిగ, నాగులవరం, తాళ్లూరు గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యేకు ప్రజలు అడుగడుగునా ఆత్మీయ స్వాగతం పలికారు. 'అన్నా గెలుపు మళ్లీ మనదే' అంటూ మహిళలు మంగళహారతులిచ్చి దీవించారు. గుమ్మడికాయలతో దిష్టితీసి స్వాగతించారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా ప్రచారం పూర్తయ్యే వరకూ ప్రజలంతా ఎమ్మెల్యే వెంటే నడిచారు. తొలుత వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు ఆధ్వర్యంలో నాగులవరం కూడలి నుంచి సుందరగిరివారికండ్రిగ వరకు యువత భారీ స్థాయిలో బైక్ ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. యువతతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేను సుందరగిరివారి కండ్రిగలో స్థానికులు ఘనంగా స్వాగతించారు. యువత పూలవర్షం కురిపించగా మహిళలు మంగళహారతులు ఇస్తూ, దిష్టి తీస్తూ విజయం మనదే అంటూ దీవించారు. అనంతరం సోమేశ్వరపురం, జక్కేపల్లిగూడూరు, ఏబీ కండ్రిగ, నాగులవరం, తాళ్లూరు పంచాయతీల్లోనూ కనీవినీ ఎరుగని రీతిలో ఎమ్మెల్యేను స్వాగతించి అభిమానం చాటుకున్నారు. తాళ్లూరు పంచాయతీలో ప్రచారం ఆలస్యంగా ప్రారంభమైనా అభిమానంతో జనాలు ఎదురు చూశారు. ప్రతిచోటా కార్యకర్తలు, నాయకుల కన్నా సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన పేదల హడావుడే ఎక్కువగా కనిపించింది. నాలుగున్నరేళ్లుగా మంచి చేస్తున్న ప్రభుత్వానికి మద్దతు తెలిపేందుకు అంటూ స్వచ్ఛందంగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



బిట్రగుంట: ప్రచారంలో ప్రజలు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

మొదటి నుంచి అదే అభిమానం

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి బోగోలు మండలం కంచుకోటగా నిలిచింది. గత రెండు ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేకు అత్యధిక మెజార్టీ అందివ్వడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు క్లీన్‌స్వీప్ చేశారు. దీంతో మండలంలో టీడీపీ ఉనికి పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. అదే అభిమానంతో ఈ దఫా ఎన్నికల ప్రచారంలో కూడా ఓటర్లు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొని ఎమ్మెల్యేకు తమ మద్దతు తెలిపారు. గతం కన్నా అధికంగా మెజారిటీ వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.